


శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 2,66,476
వెండి : 15 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



కొనసాగుతున్న వర్షాలు
వర్షాలు కొనసాగుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయి.
- 8లో



బయటకు వచ్చిన రైల్వే ట్రాక్
బురదలో కూరుకుపోయిన రైల్వే ట్రాక్ ఎట్టకేలకు బయటకు వచ్చింది. పలు రైళ్లు రద్దు చేశారు.
- 8లో

న్యూస్‌రీల్

చేపలు పట్టడానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతి



కొట్‌పాడ్ సమితి గిర్ల వద్ద మృతదేహాల కోసం గాలిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

కొరాపుట్: చేపలు పట్టడానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ సమితి గిర్ల గ్రామ పంచాయతీ చిటగాం గ్రామానికి చెందిన దుమార్ పూజారి (30), చిత్ర గుడ ధనురా పూజారి (35) చేపలు పట్టడానికి చెరువులోనికి వెళ్లారు. అదుపు తప్పి నీటిలో పడి మునిగి పోయారు. ఇది దూరం నుంచి గమనించిన వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కొట్‌పాడ్ నుంచి అగ్ని మాపక సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలికి తీశారు. కొట్‌పాడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శిరో ముండనంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

కొరాపుట్: గంజాం జిల్లాలో దళిత యువకుల శిరో మండనంపై కొరాపుట్ జిల్లా బందుగాం సమితి కేంద్రంలో దళిత, మైనారిటీ సంఘాల ప్రజలు గురువారం ఆందోళన చేపట్టారు. ఆవుల అక్రమ రవాణా చేశారనే ఆరోపణతో ఈ ఆకృత్యానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇద్దరు దళిత యువకులకు అరగుండు గీయించి రోడ్డు మీద ఊరేగించారన్నారు. దళితుల మీద దాడులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఆకృత్యాలు జరగకుండా పాలకులు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీడీవో కార్యాలయం, పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు.

గోడకూలి తల్లీ, కొడుకులకు గాయాలు



గాయాలుపాలైన తల్లీ, కొడుకులు

రాయగడ: ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గోడ కూలడంతో తల్లీ, కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం వేకువజామున సదరు సమితి పరిధిలోని గదబగుడ గ్రామంలో చోటు చేసుకుంది. క్షతగాత్రులను గ్రామస్తులు అంబులెన్స్ సాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. గదబగుడ గ్రామంలో నివాసముంటున్న సబితా బిడిక, ఆమె కొడుకు చంద్రశేఖర్ బిడికలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మట్టిగోడ ఒక్కసారిగా వారిమీద పడిపోయింది. దీంతో గ్రామస్తులు సమాచారం తెలుసుకుని వెంటనే అక్కడకు వెళ్లి మట్టిపెళ్లల మధ్య ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీశారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిగోడ పూర్తిగా తడిచిపోవడంతో కూలిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

శ్రీ గుండిచా అడపా మండపంపై నవమి సంధ్యా దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు





నవమి దర్శనం కోసం భక్తుల తాకిడితో జనసంద్రంగా మారిన శారదా బాలి ప్రాంగణం

నేడు మారు రథయాత్ర

- అడపా మండపంలో చివరి దర్శనం
- పోలీస్ డీజీ పర్యవేక్షణ

భువనేశ్వర్: శ్రీ గుండిచా ఆలయంలో భక్తులు శ్రీ జగన్నాథుని సంధ్యా దర్శనం కోసం తండోపతండాలుగా తరలి వచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు పరిమితం చేశారు. అడప మండపంపై ఇది చివరి దర్శనం. ఈ సందర్భంగా శారదా బాలి జనసముద్రంగా మారింది. మహా ప్రభువు దర్శనం కోసం బొడొశొంఖొ వరకు బారులు తీరారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా శుక్రవారం శ్రీ గుండిచా ఆలయం ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా శారదా బాలి ప్రాంగణంలో భక్తుల రద్దీ నియంత్రణ, మారు రథ యాత్ర భద్రతా సన్నాహాల్ని ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. బహుడా యాత్ర పురస్కరించుకుని పోలీసులు వాహనాల రవాణా వ్యవస్థ కట్టుదిట్టం చేశారు. అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ దయాళ్ గంగ్వార్ ప్రత్యక్షంగా ఈ బాధ్యతల్ని పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి ప్రజలకు బల్క్ సందేశాలు పంపిస్తారు. జన సందోహం ఉన్న చోట డ్రోన్, సీసీటీవీ ఫుటేజ్ ద్వారా అన్ని ఫోన్లకు సందేశాలు పంపిస్తారు. అదనంగా జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీల ద్వారా కూడా వాహన చోదకులకు సమాచారం ప్రసారం చేస్తారు. నవమి సంధ్యా దర్శనం, మారు రథ యాత్ర బహుడా భద్రత, రక్షణల సమగ్ర వ్యవస్థని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ వైబీ ఖురానియా పర్యవేక్షించారు. జన్మ వేదికపై శ్రీ జగన్నాథుని చివరి దర్శనం క్రమబద్ధీకరణ కార్యాచరణని పరిశీలించారు. శాంతి భద్రతల ఏర్పాట్లపై ఆయన దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఇతర సీనియర్ అధికారులతో పోలీస్ డైరెక్టర్ జనరల్ సమావేశమయ్యారు.



నవమి సంధ్యా దర్శనం కోసం శ్రీ గుండిచా ఆలయం సింహ ద్వారం గుండా ప్రవేశిస్తున్న భక్త జనం



నవమి సంధ్యా దర్శనంలో భక్తుల జై జగన్నాథ్ నినాదం



శారదా బాలిలో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షణలో రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వైబీ ఖురానియా

భక్తులకు నిరుత్సాహం

భువనేశ్వర్: పవిత్ర ఆషాఢ శుక్ల పక్ష నవమి రోజున గుండిచా ఆలయంలో నవమి సంధ్యా దర్శనం ప్రాప్తిస్తుంది. అడపా మండపంపై ఒక రోజు దర్శనం శ్రీ మందిరం నీలాద్రి మండపంపై జగతి నాథుడు శ్రీ జగన్నాథ స్వామి పది సంవత్సరాల దర్శనం పుణ్యఫలం ప్రసాదిస్తుందని పౌరాణిక కథనాలు సూచిస్తున్నాయి. స్వామి జన్మస్థలం అడపా మండపంపై పగటి పూట దర్శనం కంటే సంధ్య వేళ దర్శనం పుణ్యం పది రెట్లు అధికంగా లభిస్తుంది. అందుచేత నవమి సంధ్యా దర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది.

అడపా మండపంపై శ్రీ నవమి సంధ్యా దర్శనం సాయంత్రం 6 గంటల వరకే పరిమితం చేశారు. స్వామి మారు రథ యాత్ర బహుడా యాత్రకు ముందస్తు సన్నాహాలు, బహుళ సేవల ఆచరణ ఒత్తిళ్ల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్రీ మందిరం పాలక వర్గం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ గుండిచా ఆలయ సింహ ద్వారం గుండా ప్రవేశం నివారించారు. దీంతో భక్తులకు నవమి నాడు సంధ్య వేళలో దర్శనం ప్రాప్తి లేకుండా పోయింది. సర్వత్రా అసంతృప్తి వ్యక్తం అవుతోంది. శ్రీ గుండిచా ఆలయ శుద్ధి తర్వాత తర్వాత అడప మండపంపై అనేక ముఖ్యమైన సేవలను నిర్వహించాల్సి ఉంటుంది. బహుడా యాత్ర రోజున రథంపై మూల విరాటులను దర్శించుకునే అవకాశం భక్తులు పొందుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు భక్తజన వర్గం జగతి నాథుని పట్ల భక్తి పూర్వక సేవ, అంకిత భావంతో సహకరించాలని అభ్యర్థించారు. అనుబంధ వర్గాల సేవకుల సహకారం, సమన్వయంతో బహుడా సంబంధిత సేవల్ని సకాలంలో పూర్తి చేయాలని అభ్యర్థించారు.



శ్రీ జగన్నాథుడు

కల్కి అవతారంలో జగన్నాథుడు



కల్కి అవతారంలో జగన్నాథ, బలభద్రులు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

పర్లాకిమిడి: స్థానిక గుండిచా మందిరంలో జగన్నాథ స్వామి శుక్రవారం కల్కి అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ రోజుతో దశవతారాలు పూర్తయ్యాయి. శనివారం బహుడా యాత్ర సందర్భంగా శ్రీజగన్నాథరథాలు తిరుగుముఖం పెట్టారు. గుండిచా మందిరం వెలుపల ఆనందబజార్‌లో శుక్రవారం భక్తులకు ఉచితంగా ఓబ్బడా (అన్న ప్రసాదం) రథాయాత్ర కమిటీ అందజేసింది.

• విద్యార్థులకు సత్కారం



శివాంజనేయను సత్కరిస్తున్న హెచ్‌ఎం ధనుంజయ



సంజయ్ జెన్నాను సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పర్లాకిమిడి: గుసాని సమితి గురండి శ్రీక్రిష్ణచంద్ర గజపతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు తోమాని శివాంజనేయ, శ్రద్ధాంజలి పాత్రోను పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టువారు సత్కరించారు. గురండికి చెందిన టి.శివాంజనేయకు పదో తరగతి బోర్డు పరీక్షల్లో 559 మార్కులు సాధించాడు. శుక్రవారం గురండి ఎస్‌కేసీజీ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి.ధనుంజయ, రిటైర్డు మాస్టారు (పాతపట్నం) పి.రామరాజు ఆధ్వర్యంలో విద్యార్థులను దుశ్శాలువతో సత్కరించి వెయ్యి రూపాయల నగదు, మెమెంటోను అందజేశారు. అలాగే గురండి ఆదర్శరైతు, ప్రకృతి బంధు అవార్డు, కృషివంశికి కిసాన్ అవార్డు గ్రహీత సంజయ్ జన్నాకు కూడా రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సత్కరించారు.

త్వరలో పూరీ ప్రపంచ పర్యాటక కేంద్రం: ముఖ్యమంత్రి

భువనేశ్వర్: పవిత్ర పుణ్యక్షేత్రంగా పేరొందిన పూరీ పట్టణం అతి త్వరలో ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం ప్రకటించారు. అంతకు ముందు పూరీ మున్సిపాలిటీని మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేయనున్నట్లు విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించారు. పూరీ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చే ప్రక్రియ తక్షణమే శనివారం నుంచి ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. పూరీ మున్సిపాలిటీ పట్టణవాసులకు అవసరమైన సౌకర్యాలను అందించలేకపోతుంది. పెరుగుతున్న జనాభా, సందర్శకులను దృష్టిలో ఉంచుకుని పూరీ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఎదుగుదల కల్పించడం ప్రభుత్వ సంకల్పంగా పేర్కొన్నారు. పూరీ పట్టణ విస్తరణ ప్రక్రియలో భాగంగా సమీపంలోని 10 పంచాయతీలను పట్టణంలో విలీనం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ పంచాయతీలను పూరీ పట్టణ పరిధిలో విలీనం చేయడం ద్వారా మెరుగైన సమన్వయం, అభివృద్ధి ప్రణాళిక సాధ్యమవుతుంది. సమగ్ర నగర పాలనా సంస్కరణలకు మార్గం సుగమం అవుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీ జగన్నాథ్ మ్యూజియం, గ్రంథాలయం, పరిశోధనా కేంద్రం, ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించనున్నట్లు తెలిపారు.

మంత్రి సూర్యవంశీ దృష్టికి సమస్యలు



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సూర్యవంశీ సూరజ్

రాయగడ: రాష్ట్ర ఉన్నత విద్యా, క్రీడా, సాంస్కృతిక శాఖల మంత్రి సూర్యవంశీ సూరజ్ శుక్రవారం రాయగడలో పర్యటించారు. ముందుగా స్థానిక సద్భావన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించిన ఆయనకు క్రీడాకారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంతోమంది ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ వారికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో రాణించలేకపోతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జిల్లాలోని అన్ని సమితుల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టిందని తెలియజేశారు. త్వరలో వాటి రూపకల్పన పూర్తవ్వడంతో పాటు క్రీడాకారులకు అన్ని రకాల వసతులు, క్రీడా సౌకర్యాలను కల్పిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ ఆలీ నూర్, సాంస్కృతిక విభాగం అధికారి సుస్మిత బౌరి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ ప్రధాన్ అరెస్ట్

- బెయిల్ తిరస్కరణ
- ఝరపడా జైలుకు తరలింపు

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌పై అవమానకర దాడి ప్రధాన సూత్రధారిగా నిందిత భారతీయ జనతా పార్టీ నాయకుడు జగన్నాథ్ ప్రధాన్ నగర డీసీపీ కార్యాలయంలో స్వచ్ఛందంగా లొంగిపోయాడు. అనంతరం అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు. ఖారవేళ నగర్ ఠాణాలో దాఖలైన ఎఫ్ఐఆర్, బాధితుడి వాంగ్మూలం ఆధారంగా అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. జగన్నాథ్ ప్రధాన్ అరెస్టుతో బీఎంసీ కేసులో అరెస్టుల సంఖ్య ఆరుకి పెరిగింది.


స్థానిక క్యాపిటల్ హాస్పిటల్‌లో ఆరోగ్య పరీక్షల తర్వాత కోర్టు కార్యకలాపాలు చేపట్టారు. జగన్నాథ్ ప్రధాన్ బెయిల్ కోర్టులో తిరస్కరించి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి న్యాయ స్థానం ఆదేశించింది. దీంతో అతనికి స్థానిక ఝరపడా జైలుకి తరలించారు. జిల్లా జడ్జి కోర్టులో అరెస్టుని సవాలు చేస్తామని నిందితుని తరఫు న్యాయవాది తెలిపాడు. జగన్నాథ ప్రధాన్ అరెస్టు తర్వాత అతని మద్దతుదారులు వాణీ విహార్ స్క్వేర్ వద్ద నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై రవాణా తీవ్రంగా ప్రభావితమైంది. ప్రభుత్వానికి ఇచ్చిన మాట ప్రకారం ఓఏఎస్ సంఘం తక్షణమే నిరసన విరమించుకున్నట్లు అధ్యక్షుడు జ్యోతి మిశ్రా ప్రకటించారు. తీవ్ర వాగ్వాదంలో జూన్ 30న బీఎంసీ అదనపు కమిషనర్ రత్నాకర్ సాహుపై దాడి జరిగింది. దీనికి నిరసనగా బీఎంసీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. రత్నాకర్ సాహు స్థానిక ఖారవేళ నగర్ ఠాణాలో పోలీసులకు లిఖిత ఫిర్యాదు దాఖలు చేశాడు. ఖారవేళ నగర్ పోలీస్ ఠాణాలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా పోలీసులు 29వ నంబర్ వార్డ్ కార్పొరేటర్ జీవన్ రౌత్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశారు. కార్యాలయంపై దాడి జరిగిన ఘటనలో జీవన్ రౌత్, రష్మి మహాపాత్రో, దేబాశిష్ ప్రధాన్‌లను అరెస్టు చేశారు.

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కార్యక్రమానికి స్వచ్ఛ్ సాథీ ప్రేరణతో మహిళలను తీసుకెళ్లినందుకు రత్నాకర్ సాహు ఆమెని సస్పెండ్ చేశారని జగన్నాథ్ ప్రధాన్ ఆరోపించారు. ఈ ఉక్రోషంతో అతని అనుచరులు అధికారిని నిలదీయడంతో జరగరానిది జరిగిపోయినట్లు ప్రచారం ఊపందుకుంది. సోమవారం బీఎంసీ కార్యాలయం లోపల ఆరు నుంచి ఏడు మంది యువకులు అదనపు కమిషనర్‌ను దారుణంగా కొట్టారు. వారు అతన్ని నేలపై ఈడ్చుతూ కర్రలతో కొట్టి అవమానపరిచారు. జగన్నాథ్ ప్రధాన్‌ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఓఏఎస్, ఓఆర్ఎస్ అధికారులు సామూహిక సెలవు ఆందోళనకు దిగారు. తరువాత మరో ఇద్దరి అరెస్టుతో, అరెస్టుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ సంఘటనలో 5 మందిని బీజేపీ వారి ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. దాడి జరిగిన రోజు రాత్రి 11 గంటలకు ముఖ్యమంత్రి ఓఏఎస్ అసోసియేషన్ సభ్యులను కలిసి, నిందితులు మరియు దాడికి పాల్పడిన వారు ఎంత శక్తివంతులైనా చట్టాన్ని పూర్తిగా ఎదుర్కొంటారని హామీ ఇచ్చారు. హామీ ప్రకారం ప్రధాన సూత్రధారి ఆరోపణ ఎదుర్కొన్న పార్టీ నాయకుని అరెస్టు చేయించడంలో తన వంతు పాత్ర పోషించారు.

ముగిసిన గుహారీ భక్తి సంగీత ఉత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



భక్తి సంగీతాలాపనలో గాయకుడు



వాయిద్య సహకారంలో కళాకారులు

భువనేశ్వర్: స్థానిక ఉత్కళ రంగస్థలంపై ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి శాఖ సహకారంతో గురు కేలూ చరణ్ మహాపాత్రో ఒడిస్సీ పరిశోధన కేంద్రం నిర్వహించిన జగన్నాథ భక్తి సంగీత ఉత్సవం గుహారీ 2025 శుక్రవారంతో ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో బిభు కిశోర్, దీప్తి రేఖా పాఢి, అచ్యుత మహరణ, అంతరా చక్రవర్తి, రాజేంద్ర కుమార్ స్వంయి, జయశ్రీ ధొళొ, సర్వేశ్వర్ బైతరు, ప్రతిభా ప్రధాన్, కేశబ్ సాహు వంటి ప్రఖ్యాత గాయకుల సంగీతాలాపన ఆడిటోరియంలో భక్తి వాతావరణాన్ని ఆవిష్కరించింది. సమర్పి దెలి, జగబంధు పారి జొణే సామంత, భుజొ తొళే మోతే, జగన్నాథ కాలే జా అనాథ, నీలచక్రే హో దెఖొ ఉడుచి బన్నా, థక్కొ మొన్నా చలో జిబా, చందన చర్చిత నీలా కలేబరా, హతియా ఠకురా, గోరా నబఘనా భక్తిగీతాల్ని ఆలపించారు. సీతారామ నాయక్ (డ్రమ్), బంశీధర సాహు (వేణువు), ప్రియరంజన్ మహంతి (ఆక్టోపాడ్), భగీరథి బెహెరా (కీబోర్డ్), ఆకాష్ బిస్వాల్ (హార్మోనియం) వాయిద్య సహకారం అందించారు. ముగింపు ఉత్సవానికి గౌరవ అతిథులుగా ప్రముఖ నేపథ్య గాయని తృప్తి దాస్, గురు కేలూ చరణ్ మహాపాత్రో ఒడిస్సీ పరిశోధన కేంద్రం గురువులు జగన్నాథుడికి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పండిట్ కేశబ్ చంద్ర రౌత్ (ఒడిస్సీ గాత్రం), మర్దల వాయిద్యంలో గురువులు సచ్చిదానంద దాస్, గురు కాలంది చరణ్ పరిడా, గురు రమేష్ చంద్ర దాస్ (వయోలిన్) ఒడిస్సీ నృత్య విభాగంలో గురు లీనా నందా, గురు కేలూ చరణ్ మహాపాత్రో ఒడిస్సీ పరిశోధన కేంద్రం పరిపాలనా అధికారి అనుజ తరిణి మిశ్రా పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ మృత్యుంజయ రథ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రథయాత్ర విషాదంపై న్యాయ విచారణకు విపక్షం డిమాండ్



బీజేడీ ప్రతినిధి బృందంతో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

- రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన బీజేడీ ప్రతినిధి బృందం



గవర్నర్‌కు అభ్యర్థన వివరిస్తున్న విపక్ష నాయకుడు దేవీ ప్రసాద్ మిశ్రా

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్రలో విషాదాలపై విపక్ష బిజూ జనతా దళ్ ధ్వజమెత్తింది. ఈ పరిస్థితుల సంస్కరణ కోసం డాక్టరు దేవీ ప్రసాద్ మిశ్రా ఆధ్వర్యంలో విపక్ష బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటితో శుక్రవారం సమావేశమైంది. ఈ నేపథ్యంలో రథయాత్ర విషాదంపై న్యాయ విచారణ జరిపించాలని శుక్రవారం గవర్నర్‌కు అభ్యర్థన పత్రం సమర్పించింది. ఈ ఏడాది జరుగుతున్న పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్రలో శ్రీ గుండిచా ఆలయం సమీపం శారదా బాలి ప్రాంగణంలో జరిగిన తొక్కిసలాటలో 750 మందికి పైగా భక్తులు గాయపడ్డారు. 3 మంది దుర్మరణం పాలయ్యారు. యాత్ర ప్రాంగణంలో జర్నలిస్టులపై పోలీసుల దాడిని విపక్ష ప్రతినిధి బృందం ఖండించింది. ఈ చర్యని పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి భారతీయ జనతా పార్టీ అనుబంధ సంస్థలకు లెక్కకు మిక్కిలిగా కార్డన్ పాస్‌లను పంపిణీ చేసినట్లు ప్రతినిధి బృందం ఆరోపించింది. ఈ చర్యతో వాహనాల రవాణా నియంత్రణ మొదలుకొని రద్దీ నియంత్రణని విపరీతంగా ప్రభావితం చేసిందని వివరించారు. ఈ సారి యాత్రలో ఆచార విరుద్ధ చర్యలతో రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ జగన్నాథుని రథం నంది ఘోష్ సకాలంలో బయల్దేర లేక పోవడం అత్యంత దురదృష్టకరం. అత్యంత ఆలస్యంగా సాయంత్రం 7.45 గంటలకు లాంఛనంగా ప్రారంభించి యాత్ర మరునాటికి వాయిదా వేశారు. 8 నెలలుగా శ్రీ మందిరం పాలక మండలి ఏర్పాటు కాలేదు. యాత్ర తదితర దేవస్థానం ఆచార వ్యవహారాల్లో భాగస్వామిగా వ్యవహరించాల్సిన పాలక మండలి లేకపోవడం కీలకమైన సమన్వయం లోపించిందని, రథ యాత్రలో తప్పిదాలకు దీనిని ఒక కారణంగా పరిగణించాల్సి ఉందని పేర్కొన్నారు. ఏడాది పూర్తి అయిన బలభద్ర స్వామి మూల విరాటు బోర్లా పడిన సంఘటనపై విచారణ ఇంత వరకు కొలిక్కి రాలేదని గుర్తు చేశారు. భక్తజన హృదయాల్ని కలచి వేసిన అత్యంత సున్నితమైన అంశాలపై మందకొడి చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని ప్రతినిధి వర్గం ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా తీవ్ర కలకలం రేపుతున్న శారదా బాలి తొక్కిసలాట మరణాలపై పూర్తి జవాబుదారీతనం కోసం ఒడిశా హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపించాలని బిజూ జనతా దళ్ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. మరిన్ని లోపాలతో తప్పిదాలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మిగిలిన రథయాత్ర కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించాలని గవర్నర్‌ను కోరారు.

క్లుప్తంగా

జనావాసాల్లో చిరుత సంచారం



కాంకేర్‌లో హౌసింగ్ బోర్డు కాలనీ ప్రహరీ మీద చిరుత

కొరాపుట్: జనావాసాల్లో చిరుత పులి సంచారం ఆందోళన రేకెత్తించింది. శుక్రవారం వేకువ జామున నబరంగ్‌పూర్ జిల్లా సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్‌లోని ఇమిలి పరాలో హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద చిరుత కనిపించింది. కాలనీ వద్ద ప్రహరీపై చిరుత కదలికలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి.

నేటి నుంచి కేంద్ర మంత్రి పర్యటన



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నిత్యానంద గోండో

కొరాపుట్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శని, ఆదివారాల్లో కొరాపుట్ జిల్లాలో పర్యటిస్తారని రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘీక సంక్షేమశాఖ మంత్రి నిత్యానంద గోండో ప్రకటించారు. శుక్రవారం జయపూర్ పట్టణంలో జగత్ జనని జంక్షన్ వద్ద బీజేపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. శనివారం ఉదయం కొరాపుట్ జిల్లా ధమంజోడిలోని భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) వద్దకు కేంద్రమంత్రి చేరుకుంటారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో జగన్నాథ శబరి శ్రీక్షేత్రంలో జరగనున్న మారు రధాయాత్ర బహుడాలో పాల్గొంటారు. అనంతరం కేంద్రియ విశ్వ విద్యాలయంలో రూ .480 కోట్లతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేస్తారు. ఆదివారం జయపూర్ పట్టణంలోని జగన్నాధ సాగర్ సమీపంలో పంచానన్ మందిర్ సమీపంలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి కేంద్రమంత్రి శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వ అకాంక్ష జిల్లాలో ఉన్న కొరాపుట్ లో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్ష చేస్తారు. ఈ పథకాలు త్వరగతిన ప్రజలకు చేరేందుకు దిశ నిర్దేశం చేస్తారు. సమావేశానికి అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి ప్రజలు తరలి వస్తారని మంత్రి నిత్యానంద గోండో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలా ఉన్న కొరాపుట్ జిల్లాలో బీజేపీని పటిష్టత చేస్తారని మంత్రి పేర్కొనారు. సమావేశంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, బీజేపీ నాయకుడు గౌతం శాంత్ర ఉన్నారు.

రైతులను కోలుకోలేని దెబ్బ తీసిన వర్షాలు



తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

జయపురం: కొద్దిరోజులుగా జయపురం సబ్‌డివిజన్‌లో విరామం లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. పలు ప్రాంతాలలో రబీ ధాన్యం పంట కోతలు జరిగిన తరువాత కొంత పంట నూర్పులు జరిగినా మరికొంత పంట కోతలు జరగి పొలాలోనే ఉన్నాయి. ఆ సమయంలో వర్షాలు పడటం వలన ధాన్యం మొక్కలు మొలిచాయని జయపురం సబ్‌డివిజన్ కుంధ్ర సమితి రాణీగుడ పంచాయతీ సర్గిగుడ గ్రామ రైతులు వెల్లడించారు. ధాన్యం కోతలు జరిగి నూర్పులు ప్రారంభించే సమయంలో వర్షాలు పడటంవలన ధాన్యం మొలకలొచ్చాయని, వర్షం నుంచి ధాన్యం మరో సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు విరామం లేకుండా పడిన వర్షాలు వలన అవరోధం ఏర్పడిందని రైతులు వాపోయారు. ఆ గ్రామంలో మనోజ్ కుమార్ మహంకుర తన 5 ఎకరాలలో వరి పండించగా వచ్చిన 130 క్వింటాళ్ల ధాన్యం వర్షాలు కారణంగా మొలకలెత్తయని వారు వెల్లడించారు.

విద్యార్థులకు చదువు కష్టాలు!



నదిని దాటుతున్న విద్యార్థులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్‌లో స్కూల్‌కు వెళ్లడానికి విద్యార్థులు పడరాని కష్టాలు ఎదుర్కొంటున్నారు. మోహానా బ్లాక్ గరడమా పంచాయతీ రాజఖమా గ్రామస్తులు వర్షాకాలంలో కిలోమీటరున్నర నడిచి గడపుర్ నదిని దాటి బడసాయి స్కూలుకు వెళ్లాల్సి ఉంటుంది. స్వాతంత్య్రం సాధించి 76 ఏళ్ల గడిచినా గడపూర్ నదిపై వంతెనను ప్రజాప్రభుత్వాలు నిర్మించలేకపోవడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మోహానా బ్లాక్ ఖుంబర్పాడ, రాంసింగ్, గురిమెరా, బెత్తగుండ, బెముడిపద, చిందన్‌కపంక, లుటిపదర్, గురుఝలి, బలిబంద, గంగుడిపంకల్ మరియు రాజఖమా గ్రామాలకు వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి.



చటువ వద్ద రోడ్డు మీద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



కూలిన ఇళ్ల వద్ద బాధితులు

కొనసాగుతున్న వర్షాలు



దశమంత్‌పూర్ హరిజన వీధిలో నిలిచిపోయిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నందపూర్ సమితి తనసింగిలో కూలిన చెట్లు తొలగిస్తున్న అగ్ని మాపక సిబ్బంది



విజయవాడ-రాంచీ హైవే మీద బొయిపరిగుడ వద్ద చెట్లని తొలగిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో వాన బీభత్సం కొనసాగుతోంది. శుక్రవారం ఇరు జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. రెండు వారాలుగా కురిసిన వర్షాల వల్ల నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత తన నియోజకవర్గంలో బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. దశమంత్‌పూర్ సమితి గిర్లిగుమ్మ వద్ద కూలిన వంతెన ప్రాంతాన్ని సందర్శించారు. దశమంత్‌పూర్ హరిజన్ వీధిలో కూలిపోయిన నివాసాలు పరిశీలించారు. వారికి పాలిథీన్ షీట్లు పంపిణీ చేశారు. బొయిపరిగుడ సమితి కేంద్రానికి వెళ్లే మార్గంలో చెట్లు కూలిపోతే అగ్ని మాపక సిబ్బంది వాటిని తొలగించారు. నందపూర్ సమితి పాడువ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసాలపై చెట్లు కూలిపోయాయి. నందపూర్ సమితి చటువ గ్రామ పంచాయతీలో రైల్వే వంతెన కింద ఉన్న మార్గం వరద నీటితో మునిగి పోయింది. కొరాపుట్-కక్కిరిగుమ్మ, పపడాహండి-దాబుగాం, డొంగ్ర-ఉమ్మర్‌కోట్, తెంతులకుంటి-ఖాతీగుడ, గిర్లిగుమ్మ-దశమంత్‌పూర్‌ల మధ్య కల్వర్టు కొట్టుకుపోయింది.

శ్రీ జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి అవాంతరం

భువనేశ్వర్: పూరీ ప్రాంతంలో శ్రీ జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి అవాంతరం ఎదురైంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన అటవీ సలహా కమిటీ (ఎఫ్ఏసీ) తీవ్రమైన అభ్యంతరాల్ని వేలెత్తి చూపింది. ప్రతిపాదిత ప్రాంతంలో విమానాశ్రయం నిర్మాణం అపార పర్యావరణ సమస్యలను ప్రేరేపిస్తుందని పేర్కొంది. ఈ ప్రాంతంలో అపురూపమైన పక్షి, తాబేళ్లు, ప్రకృతి వరమైన అమూల్య వృక్ష సంపద విపరీతంగా ప్రభావితం అవుతుందని ఎఫ్ఏసీ గుర్తించింది. అటవీ అనుమతిని నిలిపివేయడంతో పూరీలోని ప్రతిపాదిత శ్రీ జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం పెద్ద అడ్డంకిని ఎదుర్కొంది.

జూన్ 24న జరిగిన సమావేశంలో, ఈ ప్రాంతానికి చేరువలో ఆసియాలోనే అతిపెద్ద ఉప్పు నీటి సరస్సు చిలికా సరస్సును విస్తరించి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అపురూప పక్షి జాతి ఏటా ఈ తీరానికి వసల అతిథులుగా విచ్చేస్తాయి. నిత్యం ఈ సరసు ద్వీప ప్రాంతాల్లో పక్షులు గూడులు కట్టుకుని ఉంటాయి. మరో వైపు ప్రతిపాదిత విమానాశ్రయం నిర్మాణ ప్రాంగణం పరిసరాల్లో అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లీ తాబేళ్ళ సంతతి విస్తరణ, ఇరావడీ డాల్ఫిన్లు సంరక్షణ కార్యకలాపాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మాణం ఈ అపురూప ప్రాణుల సంరక్షణకు గండి కొట్టే ప్రమాదం పొంచి ఉన్నట్లు ఎఫ్ఏసీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విమానాశ్రయం నిర్మాణం కోసం ఖరారు చేసిన ప్రాంతంలో తుపాను, సముద్ర అలల కోత నుంచి మానవాళికి రక్షణ కల్పిస్తున్న అనేక అమూల్యమైన వృక్ష జాతి మట్టి కలిసిపోతుంది. ఈ పరిసరాల్లో సుమారు 13 వేల సరుగుడు, జీడి, అకాసియా వంటి మానవాళి హిత వృక్షాలు నరికేందుకు సిద్ధం కావడం పట్ల ఎఫ్ఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విపరీత పరిస్థితుల దృష్ట్యా విమానాశ్రయం నిర్మాణ దిశలో తదుపరి చర్యలకు ముందు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నుండి నిపుణుల అభిప్రాయాన్ని పొందాలని ఎఫ్ఏసీ ఒడిశా ప్రభుత్వాన్ని ఆదేశించింది. పూరీ జిల్లా సిపసరుబాలి వద్ద 27.88 హెక్టార్ల అటవీ భూమితో సహా 471 హెక్టార్లలో విమానాశ్రయాన్ని నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ. 5,631 కోట్లు. ఈ ప్రాజెక్టుకు ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రాథమిక ఆమోదం తెలిపింది.

సత్యసాయి భక్తుల సేవలు నిరుపమానం



సత్యసాయి భక్తులతో ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: భగవాన్ సత్యసాయి భక్తుల సేవలు నిరుపమానమని కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత పేర్కొన్నారు. కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి కేంద్రంలో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి సమితి కేంద్ర భవనం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి భౌతికంగా మన మధ్య లేకపోయినా అతని ఆశయాలు సజీవంగా కొనసాగుతున్నాయన్నారు. వెనుకబడిన కొరాపుట్ జిల్లాలో సాయి భక్తులు నిత్యం ఏదో ఒక సమాజ సేవ చేయడం తాను బాల్యం నుంచే గమనించానని పేర్కొన్నారు. తన వంతుగా సాయి సమితికి ఎటువంటి సాయం కావాలన్నా అందిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో సాయి సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎస్‌కే దాస్, సచిదానంద, డాక్టర్ బెహర, అరుణ్ పాత్రో (రాజా), ఎస్.నాగభూషణ్‌రావు, మర్కెండయ్ షరాఫ్, నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బయటకు వచ్చిన రైల్వే ట్రాక్



ట్రాక్ మట్టి చివరి దశలో తొలగింపు



పనిలో నిమగ్నం అయిన ఎర్త్ మూవర్స్ వాహనాలు



ట్రాక్ పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

కొరాపుట్: కొత్తవలస-కిరండోల్ రైల్వే మార్గంలో జయపూర్-కొరాపుట్ రైల్వే స్టేషన్ల మధ్య జర్తి-మాలిగూడ మధ్య కనుమరుగైన రైల్వే ట్రాక్ బయట పడింది. ఈ ప్రదేశంలో బుధవారం మట్టి, కొండ చరియలు వర్షం వల్ల ట్రాక్ మీదకు చొచ్చుకు వచ్చిన విషయం పాఠకులకు విదితమే. మూడు రోజులుగా రైల్వే సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి ట్రాక్‌ని వెలికి తీశారు. ట్రాక్ మీద ఉన్న మట్టి,బండ రాళ్లని తొలగించారు. శుక్రవారం సాయంత్రం ట్రాక్ పూర్తి స్థాయిలో కనిపించింది. ట్రాక్ పటిష్టత పరిశీలన జరుగుతుంది. ఈ ఆపరేషన్‌లో 25 వేల క్యూబిక్ బురదని ట్రాక్ మీద నుంచి తొలగించారు. 16 హెవీ ఎర్త్ మూవర్స్ రాత్రింబవళ్లు పనిలో నిమగ్నమయ్యాయి. 300 మంది సిబ్బంది, కార్మికులు, టెక్నికల్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు ప్రకటించారు. వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోరా, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘల్ ప్రత్యక్ష పర్యవేక్షణ చేశారు. ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంకువాల్ ఈ ట్రాక్ పునరుద్ధరణతో హర్షం వ్యక్తం చేశారు.

కొరాపుట్ నుంచి యథావిధిగా రైళ్లు

కొరాపుట్ నుంచి రైళ్లు యథావిధిగా నడుస్తాయి. కొరాపుట్-కోల్‌కత, కొరాపుట్-భువనేశ్వర్, కొరాపుట్-విశాఖ పట్నంలో రైళ్ల రాకపోకల్లో మార్పేమి లేదు. అన్ని రైళ్లు ఈ మార్గంలో నడుస్తున్నాయి. ఇక కిరండోల్-కొరాపుట్ మార్గంలో ట్రాక్ పటిష్టత పూర్తయిన తర్వాత రైళ్లు నడుస్తాయి.

రథయాత్ర ప్రత్యేక రైళ్లు రద్దు

పూరి రథయాత్ర కోసం జగదల్‌పూర్-పూరి, విశాఖపట్నం-పూరికి ప్రత్యేక రైళ్లని రైల్వే శాఖ ప్రకటించింది. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కానీ వెళ్లాల్సిన రెండు ర్యాక్‌లలో ఒకటి కిరండోల్ దగ్గర ఒకటి,అంబుగాం దగ్గర మరోకటి ఉండి పోయాయి. ఈ రెండు ర్యాక్‌లు వెళ్లే లోపు ఇక్కడ ప్రమాదం జరిగింది. దీంతో శుక్ర వారం రైల్వే శాఖ ప్రత్యేక ప్రకటన చేసింది.ఈ నెల 5,7 తేదీల్లో జగదల్‌పూర్ నుంచి పూరీ వెళ్లాల్సిన రైళ్లు, 6న విశాఖ-పూరి, 7న పూరి-విశాఖ పట్నం ప్రత్యేక రథయాత్ర రైళ్లు రద్దు చేసినట్లు ప్రకటించింది.

విద్యతోనే వికాసం

- మంత్రి సూర్యవంశీ సూరజ్
- ఘనంగా కళాశాల వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి సూర్యవంశీ, పక్కనే కలెక్టర్ పట్వారి, ఎస్పీ స్వాతి, ప్రిన్సిపాల్ సరస్వతి

రాయగడ: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతోందని రాష్ట్ర ఉన్నత విద్య, క్రీడా, సాంస్కృతిక శాఖల మంత్రి సూర్యవంశీ సూరజ్ అన్నారు. స్థానిక అటానమస్ కళాశాల 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. విద్యావిధానంలో రాష్ట్రం కొంత పుంతలు తొక్కుతోందన్నారు. ఆధునిక, సాంకేతిక పరంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విధంగా కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు వారు ఆసక్తి కనబరిచే రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. శ్రద్ధతో విద్యను అభ్యసిస్తే వారి భవిష్యత్ ఉజ్వలంగా మారుతుందని హితవు పలికారు. ఉన్నత విద్యవిధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్న ఈ రోజుల్లో అందుకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఆధునిక, సాంకేతిక రంగాల్లో రాణించాలని సూచించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని అన్నారు. పట్టుదల, కృషితో ముందుకు సాగితే స్వయం ఉపాధిలో రాణించి మరికొంతమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశాలు ఉంటాయన్నారు.

విద్యార్థులతో మాటా..మంతి

కార్యక్రమంలో భాగంగా కొంతమంది విద్యార్థులతో మంత్రి మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చి వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో రాయగడ వంటి ప్రాంతం ఎంతో గుర్తింపు పొందిందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఆదివాసీ, హరిజనుల సంఖ్య అధికంగా గల ఈ జిల్లాలో విద్యావిధానాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం యోచిస్తుందని వివరించారు. అటానమస్ కళాశాలలోని పలు సమస్యలను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

నివేదిక సమర్పణ..

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరస్వతి రాయ్ కళాశాల వార్షిక నివేదకను చదివి వినిపించారు. 1966వ సంవత్సరంలో ఏర్పాటైన కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందిందని అన్నారు. 2007లో స్వయం ప్రతిపత్తి కళాశాలగా గుర్తింపు పొందిందని వివరించారు. ప్రస్తుతం కళాశాలలో ఇంటర్ నుంచి పీజీ వరకు తరగతులు ఉన్నాయని.. సుమారు 5,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఎందోమంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగుతున్న ఈ కళాశాలలో వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, ఏడీఎం నిహారి రంజన్ కుహరో పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో వివిధ శ్రేణుల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు మంత్రి జ్ఞాపికలను అందించి సత్కరించారు.

సమావేశంలోనే గుండెపోటుతో ఆశకార్యకర్త మృతి



మంగులి మృతదేహం



జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అశ కార్యకర్తలు

మల్కన్‌గిరి: సమావేశంలోనే గుండెపోటుకు గురై ఆశ కార్యకర్త ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కార్యాలయంలో చోటుచేసుకుంది. ఆరోగ్యపథ్ శిక్షణ కార్యక్రమంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఖోయిర్‌పూట్ సమితి కేంద్రంలో గురు, శుక్రవారాల్లో ఆరోగ్యపథ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముదిలిపోడ పంచాయతీకి చెందిన మంగులి కిర్సని (43) హాజరైంది. శిక్షణ సమయంలో సహోద్యోగులతో నవ్వుతూ అప్పటివరకు ఆనందంగా ఉన్న ఆమె గురువారం సాయంత్రం స్పృహతప్పి పడిపోయింది. ఆమెను వెంటనే తోటి ఉద్యోగులు ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. దీంతో తోటి కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదానికి గురయ్యారు. కాగా శుక్రవారం ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలాయనికి వచ్చి తమతో పని చేసి మంగులి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రూ. 5 లక్షలు పరిహారం ఇవ్వాలని, పిల్లలు ఉండేందుకు ఇల్లు, పిల్లల చదువుకు ప్రభుత్వ సహాయం, కుటుంబంలో ఒకరికు ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు.

ఘనంగా వనమహోత్సవం



వన మహోత్సవంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవా అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు, జయపురం అటవీ డివిజన్ సహకారంతో శుక్రవారం నుంచి మహోత్సవ వారోత్సవాలను ప్రారంభించారు. జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మహంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో జీవరాశి మనుగడకు చెట్లు ఎంతో అవసరం అన్నారు. ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా జడ్జి పర్యవేక్షణలో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి మొదట మొక్కలు నాటి వనమహోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ విచారపతి స్వయం ప్రకాశ్ దాస్, జిల్లా న్యాయసేవా ప్రదీకరణ కార్యదర్శి ప్రద్యామయి సునీత, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ విష్ణు ప్రసాద్ బెహర పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం

కొరాపుట్: ఆ గిరిజన గ్రామాలకు నిత్యం ప్రాణాలతో చెలగాటమే. శుక్రవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితిలో అనేక గిరిజన గ్రామాలలో ఇదే పరిస్థితి కనిపించింది. సమితిలో చటువా, హతిబారి, నందక, రైజింగ్, బాదెల్ గ్రామ పంచాయతీలు భారీ వర్షం వల్ల తీవ్రంగా నష్టపోయాయి. ఈ వరదల కారణంగా ఎగువ కందపాలి, దిగువ కందపాలి, సరియా పుట్, అపైజొల, రంగిని గుడ, దేబ్సాంగుడ, గోడి పుట్ గ్రామాల ప్రజలు గ్రామాలకే పరిమితమయ్యారు. నదులు ఉప్పొంగడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి. దాదాపు పది రోజులుగా పరిస్థితి ఇలాగే ఉంది. కొందరు ప్రాణాలకు తెగించి నదులు, వాగులు దాటారు.



హత్తిబారి పంచాయతీ కేంద్రం నుండి మెండజోలా గ్రామానికి ప్రమాదకర స్థితిలో దాటుతున్న విద్యార్థులు



దేవసాందుగుడ వద్ద అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలను చంకలో పెట్టుకొని నది దాటుతున్న గిరిజన స్త్రీలు



దేవసందు గుడకి వస్తున్న ప్రజలు

క్లుప్తంగా

కొనసాగుతున్న డ్రైవర్ల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన నాలుగవ రోజు కొనసాగుతోంది. శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో గేటు వద్ద నల్ల బ్యాడ్జీలతో డ్రైవర్లు నిరసనలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డివేణు, జి.వెంకటరమణ, బి.సూరిబాబు తదితరులు మాట్లాడుతూ అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అద్దెబస్సు యజమానులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు కేవీ చారి, పీడీ ప్రసాద్, ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల్లో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుచేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి పోలీస్ "వెల్ఫేర్ డే"

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



పోలీసు సిబ్బంది తెలియజేస్తున్న సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: శాఖాపరమైన సేవల్లో నిత్యం నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సమస్యలతోపాటు శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి నిర్వహించారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అలాగే సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ తమ సమస్యలను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు పోలీసుశాఖ సిబ్బంది పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి స్వయంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తనకు చేరిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవకాశం ఉన్నంత మేరకు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

డోలీలో ఐదు కిలోమీటర్లు..



పూసనంది గ్రామానికి చెందిన చంద్రమ్మను డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్తున్న గిరిజనులు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పెదశాఖ పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం పూసనందికి చెందిన గర్భిణి కొండగొర్రి చంద్రమ్మ శుక్రవారం ఒక్కసారి కళ్లుతిరిగి పడిపోయింది. అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఐదు కిలోమీటర్ల రాళ్లదారిలో డోలీలో పెదశాఖ వరకు తెచ్చి అక్కడ నుంచి ఫీడర్ అంబులెన్స్‌లో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యంకోసం అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో అద్దెవాహనంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యులు అందుబాటులో లేరని చంద్రమ్మ బంధువులు ఆరోపించారు.

జిల్లాకు చెందిన సంధ్యారాణి గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేస్తున్నా విద్య, వైద్య కష్టాలు తీర్చే'దారి' చూపడంలేదని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ మల్లయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పడగ విప్పుతున్న మహమ్మారి

- జిల్లాలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు
- సింగిల్ డాక్టర్లతో నడుస్తున్న పీహెచ్‌సీలు
- 14 వైద్యాధికారుల పోస్టులు ఖాళీ
- గ్రామాల్లో వైద్యశిబిరాలు అంతంతమాత్రమే
- దోమల తెరల పంపిణీ నిల్

సీతంపేట/పాలకొండ రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా మహమ్మారి పడగ విప్పుతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా, అలాగే ఆశ్రమ, వసతిగృహాల్లో జ్వరాల బాధితులతో ఏజెన్సీలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్ ఎక్కువవుతున్నాయి. ఈ సీజన్‌లో జనవరి నుంచి ఇప్పటివరకు వరకు 1264 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారిక గణంకాలు చెబుతుండగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 42, ఆరోగ్య ఉపకేంద్రాలు 200 వరకు ఉన్నాయి. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులు ఇద్దరు చొప్పున ఉండాలి. ఒకరు మెడికల్ క్యాంప్ వెళ్లినా, మరొకరు పీహెచ్‌సీలో ఓపీ చూడాలి. 14 మంది వరకు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. రోజుకు ఓపీ 50 నుంచి 100 మధ్య పీహెచ్‌సీల్లో ఉండగా, ఏరియా ఆస్పత్రుల్లో 200 నుంచి 300ల మధ్య ఉంటోంది. మారుమూల గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. పీహెచ్‌సీల నుంచి ఏరియా ఆస్పత్రులకు రిఫరల్ కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.



జ్వరంతో బాధపడుతూ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఇందిరానగర్ కాలనీ వసతిగృహ విద్యార్థులు

550 హైరిస్క్ గ్రామాలు..

జిల్లాలో 1250 పైన గిరిజన గ్రామాలున్నాయి. వాటిలో సుమారు 550 గ్రామాలను మలేరియా హైరిస్క్ గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. దీనిలో భాగంగా ఈ గ్రామాల్లో మలేరియా కారక దోమల నివారణకు ఐఆర్ఎస్ 5శాతం ఏసీఎం ద్రావణాన్ని దశల వారీగా పిచికారీ చేస్తున్నారు. మలేరియా నివారణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ జ్వరాల నివారణ చర్యలు చేపట్టినప్పటికీ మలేరియా మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు 1,31,902 మంది రక్తపూతలు సేకరించగా వాటిలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు జూన్ నెలాఖరు వరకు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులు, చిన్నచిన్న క్లినిక్‌లు, గ్రామాల్లో సంచి వైద్యులు వంటి వారి వద్దకు వచ్చే మలేరియా పాజిటివ్ కేసులు ఇంతకు రెట్టింపు సంఖ్యలో ఉంటాయి.



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు

కాలం చెల్లిన దోమతెరలు..

దోమతెరల కాలపరిమితి ఐదేళ్లు. అయితే దోమతెరలను ఉతకడం వంటి పనులు చేస్తే మూడేళ్లకే పాడవుతాయని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో దోమతెర లకు కాలం చెల్లాయి. మరికొన్ని చినిగిపోయాయి. ఇప్పటికే పాడైన దోమతెరలను చాలా గ్రామాల్లో చేపలు పట్టడానికి, మొక్కలకు కంచె వేయడానికి వినియోగిస్తున్నారు.

20 వేల మంది అభ్యాసం

ఐటీడీఏ పరిధిలో 47ఆశ్రమపాఠశాలలు, 13 రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు గురుకుల కళాశాలలు, 13 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వాటిలో దాదాపు 20 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి కూడా దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు వారికి కూడా పంపిణీ జరగలేదు. ఈ సీజన్‌లో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో దోమతెరల వినియోగం తప్పనిసరి. ఆడ ఎనాఫిలిస్ దోమ కారణంగా ఫాల్సీఫారం మలేరియా ప్రబలుతోంది. ఇది సెరిబ్రల్ మలేరియాకు దారితీసి గిరిజనుల ప్రాణాల మీదికి వస్తుంది. అయితే దోమతెరలను విస్తృతంగా వాడించడం ద్వారా కొంతవరకు మలేరియాను నియంత్రించవచ్చని వైద్యబృందాలే తెలియ జేస్తున్నప్పటికీ వాటి పంపిణీని మాత్రం ప్రభుత్వ పట్టించుకోవడం లేదు.

జ్వరాల నివారణకు చర్యలు



జ్వరాల నివారణకు విస్తృతంగా చర్యలు చేపట్టాం. 4 లక్షల 50 వేల దోమతెరల కోసం ఇండెంట్ పంపించాం. అవి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేదు. వైద్యపోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

అటవీ భూమి ధారాదత్తం

బొబ్బిలి: ఆపరేషన్ కగార్ పేరుతో అంతర్జాతీయ కంపెనీ యజమానులైన అదానీ, అంబానీలకు 9 కోట్ల ఎకరాల అటవీ భూమిని ధారాదత్తం చేసేందుకు ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షాలు కుట్ర చేస్తున్నారని అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ అంజమ్మ, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్‌లు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని మహారాణిపేటలో కామ్రేడ్ గంటి ప్రసాదం 12వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పీకేఎస్ జెండాను ఆవిష్కరించారు. గంటిప్రసాదం స్మారక భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ మావోయిస్టుల రక్షణలో ఉన్న ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేయడం దారుణ మన్నారు. మావోయిస్టులను అంతం చేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటివరకూ సుమారు 550 మంది ఆదివాసీలు, మావోయిస్టులను పట్టుకుని అంతమొందించారని ఆందోళన వెలిబుచ్చారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజలు, ప్రజాసంఘాలు ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలకు సిద్ధం అయ్యేలా ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న అమెరికా, రష్యా, జపాన్ తదితర దేశాల్లో దేశంలో40 శాతం అడవులుండాలని చట్టాలుచేసి పర్యావరణాన్ని కాపాడుతుంటే మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దీనికి విరుద్ధంగా చర్యలు తీసుకోవడం దారుణమని ధ్వజమెత్తారు. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు గంటి ప్రసాదాన్ని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు నెల్లూరులో పొట్టన పెట్టుకుందన్నారు. ఇటీవల ఆపరేషన్ కగార్‌పేరుతో నంబాల కేశవరావు, చలపతి, సుధాకర్, గణేష్, రేణుక, అరుణ, గాజర్ల రవి తదితరులను కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ, అమిత్ షా, చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు కామ్రేడ్ గంటి ప్రసాదం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, కామ్రేడ్ అన్నపూర్ణ, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి మెరిగాని గోపాలం, పిల్లా లక్ష్మణరావు, పీకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయితి సత్యం, తమటాల అప్పలనాయుడు, దాసరి వెంకట రమణ, రెడ్డి కుమార్, ప్రజాకళామండలి రాష్ట్ర ప్రతినిధి తూముల సింహాచలం, నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంజమ్మ

ధర్నా, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

విజయనగరం క్రైమ్: ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, ఇతర నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు తప్పనిసరిగా పోలీసుశాఖ నుంచి ముందస్తుగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేనిదే ఎలాంటి నిరసనలైనా చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. ఇందుకోసం ముందుగా సంబంధిత డీఎస్పీ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు. పర్మిషన్ లేకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, సమావేశాలు నిర్వహించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. శాంతియుతంగా వ్యవహరించాలని, విజ్ఞతతో వ్యవహరించి ముందస్తు అనుమతులతోనే ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అలా కాకుండా, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.



ఎస్పీ వకుల్ జిందల్

భలే మందుల వ్యాపారం..!

- ఆ ఫార్మా కంపెనీ మందులే రాయాలంటూ హుకుం!
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులకు సంబంధిత ఉన్నతాధికారి ఫోన్‌లో ఆదేశాలు
- ఆ ఫార్మా కంపెనీ కూటమికి చెందిన ఓ ముఖ్యనేతది కావడం గమనార్హం!
- నాసిరకం మందుల అమ్మకాలతో దోపిడీ ప్రయత్నాలు
- రోగుల ఆరోగ్యంతో వ్యాపారం
- తమపై ఇదేమి రుబాబు అంటున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులు
- జిల్లాలో 25 ప్రైవేటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

'విజయనగరంలో ఉన్న ఓ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) నెట్‌వర్క్ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీకి చెందిన ఓ ఉన్నతాధికారి ఫోన్‌చేసి ఫార్మా కంపెనీకి చెందిన ప్రతినిధి వస్తారు. వారి కంపెనీకి చెందిన మందులే తీసుకోవాలి. రోగులకు వాటినే అందజేయాలి అని ఫోన్‌లో ఆదేశించారు. ఈ ఫోన్ వచ్చిన అర గంటలో సంబంధిత ఫార్మా కంపెనీ ప్రతినిధి, జిల్లాకు చెందిన ఆరోగ్యశ్రీ సిబ్బందిని వెంట బెట్టుకుని ఆస్పత్రికి వెళ్లి మా ఫార్మా కంపెనీలో తయారు చేసిన మందులను ఆరోగ్యశ్రీ రోగులకు ఇవ్వాలని చెప్పారు. చేసేది లేక సంబంధిత ఆస్పత్రి వైద్యులు మిన్నుకుండి పోయారు. నాసిరకం, డొల్ల కంపెనీ మందులు రాయాలన్న ఒత్తిడిపై ఇదేమి రుబాబు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.'



విజయనగరంలోని ఓ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్

విజయనగరం ఫోర్ట్: కూటమి నేతలు ప్రజాసంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టేసి ప్రజలను దోచుకునే పనిలోపడ్డారు. ఇసుక, మద్యం బెల్టు దుకాణాల నుంచి రోగుల ఆరోగ్యాన్ని కుదుటపర్చే మందుల వరకు అన్నింటినీ వ్యాపారంగా మార్చేస్తున్నారన్నది జనం మాట. తాజాగా జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఫోన్‌లో అందిన మౌఖిక ఆదేశాలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. ఆరోగ్యశ్రీ రోగుల చికిత్సకు అవసరమయ్యే అన్నిరకాల మందులు కూటమి నేత కంపెనీకి చెందినవే వినియోగించాలని ఆదేశించినట్టు సమాచారం. మా కంపెనీ మందులు కాదని ఇతర కంపెనీల దగ్గర కొనుగోలు చేసేందుకు వీలులేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. ఇది వైద్యవర్గాలతో పాటు మిగిలిన మందుల కంపెనీల యాజమాన్యాలను కలవరపెడుతోంది.

భారీ దోపిడీకి స్కెచ్...

భారీ దోపిడీకి కూటమి నేత స్కెచ్ వేశారు. ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) పథకం కింద అధిక శాతం మంది శస్త్రచికిత్సలు, చికిత్స తీసుకుంటారు. జిల్లాలోని 25 ఆరోగ్యశ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఏడాదికి 60 వేల నుంచి 80 వేల మంది వరకు సేవలు పొందుతారు. వీరికి మందుల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులు కోట్లాది రుపాయలు వెచ్చిస్తాయి. ఆ మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు నాణ్యతలేని మందులు సరఫరా చేయడం ద్వారా ఏడాదికి రూ.60 కోట్ల నుంచి రూ. 80కోట్ల వరకు ఆర్జించవచ్చన్నదే కూటమినేత స్కెచ్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సంబంధిత ఫార్మా కంపెనీ నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు మందుల సరఫరాకు అంతా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇప్పటివరకు నెట్‌వర్క్ ఆస్పత్రులు వారి ఆస్పత్రుల్లో అందించే వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులను వారికి నచ్చిన ఫార్మా కంపెనీల నుంచి తెప్పించుకునేవారు. ఇకపై కూటమి నేతఫార్మా కంపెనీ నుంచి తెప్పించుకోవాల్సిందే.



మందులు

పారాసిటమల్ నుంచి యాంటీ బయోటిక్ వరకు...

జ్వరం తగ్గేందుకు ఉపయోగించే పారాసిట్‌మాల్ మాత్రల దగ్గర నుంచి తలనొప్పి, ఐ డ్రాప్స్, ఇయర్ డ్రాప్స్, యాంటీ బయోటిక్స్, కడుపు నొప్పి, గ్యాస్టిక్ మాత్రలు, ప్రోటీన్ పౌడర్లు, విటమిన్, బి-కాంప్లెక్సు మాత్రలు, పలు రకాల ఇంజిక్షన్లు, సర్జికల్ మెటీరియల్స్ ఇలా అన్నిరకాల మందులు ఆ ఒక్క కంపెనీ వద్దనే కొనుగోలుచేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు అందాయి. ఆరోగ్యశ్రీకి చెందిన ఉన్నతాధికారుల నుంచి ఫోన్ రావడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సంబంధిత ఫార్మా కంపెనీ చెప్పిన మందులు కొనుగోలు చేయకపోతే ఏమవుతుందోనని మదనపడుతున్నారు. వారు చెప్పినట్టు చేయకపోతే ఆరోగ్యశ్రీ రోగులకు సంబంధించిన బిల్లులు నిలిపివేస్తారేమోనని భయపడుతున్నారు. మరోవైపు నాణ్యతలేని మందులు రాస్తే రోగులు ఎలా కోలుకుంటారని మదనపడుతున్నారు.

ఆ కంపెనీ కూటమి నేతదే..

ఫార్మా కంపెనీ కూటమికి చెందిన ఓ ముఖ్య నేతది. దీంతో సదరు నేత ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి జిల్లాకు చెందిన ఆరోగ్యశ్రీ అధికారుల ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. విజయనగరం జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ ఇదే విధంగా నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఒత్తిడి తెస్తున్నట్టు వైద్యవర్గాల్లో చర్చసాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా బలవంతంగా కూటమి నేతలు రుబాబు చేయడం పట్ల నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమానులు ఆవేదన చెందుతున్నారు.

వాస్తవమే...

ఫార్మా కంపెనీకి చెందిన ప్రతినిధి నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చిన మాట వాస్తవమే. వారి కంపెనీకి చెందిన మందులను తీసుకోవాలని కోరారు. బలవంతం పెట్టలేదు. - డాక్టర్ కుప్పిలి సాయిరాం, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల్లో జాప్యంతో తప్పని అవస్థలు
- ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించిన జెడ్పీ చైర్మన్, సభ్యులు
- తాటిపూడి నీటి మళ్లింపుపై ఎటువంటి చర్చ జరగలేదు: మంత్రి కొండపల్లి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు.. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల పూర్తి.. ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుదల.. తదితర అంశాలపై విజయనగరం జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు చర్చించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్యాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య రంగాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

విద్యార్థుల తగ్గుదల ఆందోళన కలిగించే విషయం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే విషయమని, సంఖ్య తగ్గకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని జెడ్పీ చైర్మన్ కోరారు. ఇటీవల మెరకముడిదాం మండలంలో తనిఖీ చేసినప్పుడు గత ఏడాది కన్నా 1100 మంది తగ్గారని తెలిసిందని, ఒకే మండలంలో ఇంత మంది తగ్గితే జిల్లా అంతటా ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కోవిద్యార్థి నుంచి కట్ చేసిన రూ.2వేలు పాఠశాలల ఖాతాలకు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల నమోదు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ జరగాలని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఈఓకు మంత్రి కొండపల్లి సూచించారు. ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ లోపల అడ్మిషన్లు పూర్తిచేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యం

ఏజెన్సీలోని ఆస్పత్రుల్లో ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యం చేస్తున్నారని, కురుపాం సీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరుగుతున్నా అవసరమైన భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంలో తాత్సారం చేస్తున్నారంటూ కురుపాం మండల జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతిలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కొత్తవలసలో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికంగా ఉన్న ఎన్‌జీఓ హోంలో రోగులకు సేవలందిస్తున్నారని, ఒకే గదిలో రోగులకు తనిఖీలు, ఆపరేషన్లు చేస్తున్నారని జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి సభలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన అధికారులు త్వరలో భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో స్కానింగ్ యంత్రాలు ఎందుకు పని చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. సర్వజన ఆస్పత్రి నుంచి విశాఖలో కేజీహెచ్‌కు రిఫరల్ కేసుల సంఖ్య పెరుగుతోందని, ప్రజాప్రతినిధులు ఫోన్ చేసి చెబితే మరింత వేగంగా ఇతర ఆస్పత్రులకు పంపించడం వెనుక అంతర్యమేమటన్నారు. స్పందించిన సూపరింటెండెంట్ కార్డియాలజీ, గ్యాస్ట్రో తదితర అత్యవసర కేసులను తప్పనిసరి పరిస్థితుల్లో రిఫరల్ చేయిస్తున్నామని, ఆస్పత్రుల్లో అన్ని యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనబంధంగా సర్వజన ఆస్పత్రిని మార్చుచేసే ప్రక్రియపై కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాల వద్దకు ఆస్పత్రిని తరలిస్తే ప్రజలకు దూరం అవుతుందని, అటువైపు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా లేదని, కొన్ని విభాగాలను బోధనాస్పత్రి వద్ద ఏర్పాటు చేసి, పాత ఆస్పత్రినే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

- అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను కోరారు. మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొందరు రైతులు ఎరువులు, విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, అధిక ధరలకు విక్రయించే వారిపై విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

తాటిపూడి నీటి కోసం ఆందోళన వద్దు

గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎంఎస్ఎంఈ పార్కుకు తాటిపూడి నుంచి నీరందించడంపై ప్రభుత్వ చర్చకు రాలేదని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. దీనిపై జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తాటిపూడి కేవలం రైతుల ఆయకట్టుకు సాగునీరందించే ప్రాజెక్టు అని, జిందాల్ సంస్థ స్వయంగా నీటి వసతులు ఏర్పాటుచేసుకోవాలన్నారు.

- శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లు లేరని, సచివాలయాల నుంచి డిప్యుటేషన్ వేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- ఉపాధిహామీ పనుల తీర్మానాలపై సభలో చర్చ జరిగింది. గ్రామ సభల్లో తీర్మానించిన వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తున్నారంటూ పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికార బలంతో ఎంపీడీఓలను అడ్డంపెట్టుకుని ఎమ్మెల్యేలు చెప్పిన పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు.